క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్


ప్రియాంకకు మొక్క అందజేస్తున్న కుమారస్వామి

ఇల్లెందు: గుండాల పర్యటనలో భాగంగా ఇల్లెందు విచ్చేసిన కలెక్టర్ ప్రియాంక అలను ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ పి.కుమారస్వామి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఇల్లెందులోని సింగరేణి గెస్ట్ హౌజ్‌లో ఆమెను కలిసిన పుష్పగుచ్ఛం, ఓ మొక్కను అందజేశారు. ఏఈ శంకర్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ బాలరాజు ఉన్నారు.

వద్దిరాజుకు స్వాగతం


రవిచంద్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

జూలూరుపాడు: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు ఆదివారం మున్నూరు కాపు సంఘం నాయకులు కొమ్ముగూడెం గ్రామంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు.

జలగంను కలిసిన నాయకులు


మాజీ ఎమ్మెల్యే జలగంకు అభినందనలు తెలుపుతున్న నాయకులు


చుంచుపల్లి: కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావును చుంచుపల్లి మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో కలిశారు. ఇటీవల కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో పలువురు నాయకులు జలగంను కలిసి అభినందనలు తెలిపారు.

'మడత' వెనకే నడుస్తాం..


హాజరైన కొత్తకాలనీ ప్రజలు

ఇల్లెందు: మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ మడత రమా- మడత వెంకట్‌గౌడ్‌లతోనే మా పయనం అంటూ కొత్త కాలనీ వాసులు స్పష్టం చేశారు. ఆదివారం కొత్తకాలనీలో 12, 13 వార్డులకు చెందిన ప్రజలు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. గతంలో నా మద్దతుదారులే వార్డు సభ్యులుగా గెలిచారని, వచ్చే ఎన్నికల్లో కూడా తన మద్దతుదారులే గెలుస్తారని తెలిపారు.

అంగన్‌వాడీ వైస్ ప్రెసిడెంట్‌కు సన్మానం



గోనెమణిని సన్మానిస్తున్న నాయకురాళ్లు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోషియేషన్ మహాసభల నూతన రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయిన ఏఐటీయూసీ అంగన్‌వాడీ గోనె మణిని ఆదివారం సీపీఐ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, మహిళా సమాఖ్య నాయకురాళ్లు కరీష రత్నకుమారి ఆధ్వర్యంలో శేషగిరిభవన్‌లో ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే..

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 25 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడికక్కడే చెత్త చెదారం పేరుకుపోతోంది. దీనికి తోడు వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వీధుల్లోని చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

- వర్షాలకు కంపుకొడుతున్న గ్రామాల్లోని వీధులు
- అంటువ్యాధులు ప్రబలే అవకాశం
- సమ్మెలో ఉన్న పంచాయతీ కార్మికులు


సమ్మెలో పాల్గొని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

సుజాతనగర్: అసలే ఇది వర్షాకాలం.. విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మొన్నటి వరకు నమోదైన లోటు వర్షపాతం ఆందోళన కలిగించినా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జూలై 27న ఒక్కరోజే మండలంలో 153.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గ్రామాల్లో వీధులన్నీ బురద మూలంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. వరద ప్రభావంతో వీధులు, సైడు కాల్వలు చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు 25 రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో పల్లెలో పారిశుద్ధ్యం కుంటుపడింది. సుమారు 69 మంది పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. అధికారులు కొంతమంది తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్తను ఎత్తిస్తున్నా అంతగా ఫలితం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

నిలిచిన పారిశుద్ధ్యం పనులు.. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణలో మల్టీపర్పస్ కార్మికులే కీలకం. డ్రైయినేజీలు శుభ్రం చేయడం, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం, రోడ్లను శుభ్రపరచడం, హరితహారం పనులు, క్లోరినేషన్, పాఠశాలల్లో పారిశుద్ధ్యం పనులు, నీటి సరఫరా, పంచాయతీ కార్యాలయంలో పనులు తదితర పనులన్నీ వీరే చేస్తుంటారు. ప్రస్తుతం వీరంతా సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో ఆయా పనులన్నీ ఆగిపోయాయి. వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లోని వీధులన్నీ అపరిశుభ్రంగా మారాయి.

వ్యాధులతో పొంచిఉన్న ముప్పు.. ప్రస్తుతం చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. వరద అనేక రకాల రసాయనాలు, ఒండ్రుమట్టిని వెంట తీసుకొస్తోంది. పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులకు ఏర్పడిన లీకేజీల కారణాలతో తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది. పారిశుద్ధ్య లోపంతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారులు, వృద్ధులపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. ఇంటి పరిసరాల్లోని ఖాళీ కొబ్బరి బొండాలు, ఇంటిపై ఉన్న పాత డబ్బాలు, టైర్లు, పార్కింగ్ ప్రదేశాల్లోని పూలకుండీల్లో నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు వాటిని తొలగించడం ద్వారా దోమలు వ్యాప్తిని అరికట్టచ్చని, ఇంటిపై ఉన్న నీటి ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.


సుజాతనగర్‌లో ఓ వీధిలో చెత్తకుప్ప

కార్మికుల ప్రధాన డిమాండ్లు

- ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.
- ప్రత్యేక బడ్జెట్‌తో వేతనాలు చెల్లించాలి.
- కనీస వేతనం రూ.19000 ఇవ్వాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి.
- విధుల్లో సిబ్బంది మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతన పెంపుకు అనుమతి ఇవ్వాలి.
- మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి


పంచాయతీల్లో పరిశుభ్రతలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కార్మికులకు వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా క్రమబద్ధీకరణ లేదు. ఒక కార్మికుడు ఒకే పని చేసేలా నిబంధనలు మార్చాలి. ఆరోగ్య కార్డులు అందించాలి. – కూరపాటి లక్ష్మణ్, పంచాయతీ కార్మికుల సంఘం నాయకుడు

సమస్యలు పరిష్కరించండి


25 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారాయి. వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలి. – వేల్పుల భాస్కర్, సీపీఐ నాయకుడు

ప్రత్యామ్నాయం చూస్తున్నాం


పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతున్నాం. రోజువారీ కూలీలతో చెత్త తొలగింపు, కాల్వల పరిశుభ్రత చేపడుతున్నాం. సీజనల్ వ్యాధులు రాకుండా బ్లీచింగ్ చల్లించి, నీల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. – టి.వెంకటలక్ష్మీ, ఎంపీడీఓ

రహదారిని అనుసంధానించండి


వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సుజాతనగర్: సుజాతనగర్, సీతంపేట గ్రామాలను కలుపుతూ ఎదుళ్లవాగుపై నిర్మిస్తున్న వంతెనకు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన అప్రోచ్ రహదారిని అనుసంధానించి రాకపోకలను పునరుద్ధరించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. మాట్లాడుతూ.. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా నేటికీ పనులు పూర్తి కాలేదన్నారు. ఈ వంతెన గుండా నిత్యం అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు నిర్వహిస్తున్నారని, ముఖ్యంగా రైతులు, కూలీలు వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో చుట్టూ తిరిగి రావడం వలన అదనపు భారం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన పనులు ప్రారంభమైనప్పటి నుంచి అధికారుల పర్యవేక్షణ లేదని, పనులు నత్త నడకన కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, కొండె కృష్ణ, బచ్చలికూర శ్రీను, నల్లగోపు పుల్లయ్య, గండమల్ల భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పొంగులేటి సాయం

చుంచుపల్లి: భారీ వర్షాలకు అతలాకుతలమైన ములుగు జిల్లా వరద బాధితులకు ఖమ్మం మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయం అందించారు. ఆదివారం విద్యానగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఊకంటి గోపాలరావు, ఆళ్ల మురళీ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు, స్టీల్ సామాన్లను ప్రత్యేక వాహనాల్లో ములుగు తరలించారు. మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో వరద బాధితుల బాధలు వర్ణనాతీతంగా తయారైయ్యాయని దాన్ని గమనించిన పొంగులేటి పెద్ద ఎత్తున సహాయం చేయడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. గోపాలరావు కష్టాల్లో ఉన్న వరద బాధితులకు ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి సేవలు అందుతున్నాయని, పక్క జిల్లా వాసులకు అండగా నిలవాలనే పొంగులేటి ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులతో పాటు పలు వంట సామగ్రిని ములుగు ఎమ్మెల్యే సీతక్కకు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో తాండ్ర నాగబాబు, సత్యనారాయణరెడ్డి, కలకోట రాజు, పృథ్వీరెడ్డి, శ్యామ్, నవీన్, వరప్రసాద్, నరేష్, అజయ్, రాము, సతీష్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

పాల్వంచరూరల్: తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించినట్లు అధ్యక్షుడు ఆనందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా పాయం ఆనందరావు, ప్రధాన కార్యదర్శిగా చాపల రమేష్‌బాబు, ప్రచార కార్యదర్శి ఊకే కృష్ణ, ఉపాధ్యక్షుడు పాయం విజయ్‌బాబు, వేప హరినాథ్, కోశాధికారి కంగాల వెంకయ్య, మహిళ ఉపాధ్యక్షురాలు పాయం రాధ, జిల్లా కార్యదర్శులుగా పెండకట్ల నాగేశ్వరరావు, కోరం శాంతిరావు, పూనెం కమలాకర్, కుంజా రవికుమార్, పూనెంబాలరాజు, మోకాళ్ల ప్రభాకర్‌రావు, పాయం రమేష్, కల్తి వీరభద్రం, మోకాళ్ల కృష్ణార్జున్, మోహన్‌రావు, దొడ్డ రామ్మూర్తిలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: తడికలపూడి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి కల్తి భరత్ (15) ఈనెల 17న రాత్రి పాముకాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య తడికలపూడిలోని భరత్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, సోదరుడిని పరామర్శించారు. రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు.

మున్సిపల్ సమావేశం జరిగేనా ?

ఇల్లెందు: మున్సిపల్ సమావేశం దోబూచులాడుతోంది. సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు తొలుత ప్రకటించారు. అజెండాను సభ్యులకు అందజేశారు. అకస్మాత్తుగా ఆదివారం రాత్రి సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 27న నూతన కమిషనర్‌గా కుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు. అయితే 26న అజెండా తయారైనట్లు ప్రకటించి 29న అందరికీ పంపిణీ చేసి 30న వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడమేమిటని సభ్యులు పేర్కొంటున్నారు.

చెక్కుల పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలతో ఉన్న పలువురు చేసిన దరఖాస్తులకు స్పందించిన ప్రభుత్వం రూ.3.09 లక్షలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.

ఉద్యమాలు కొనసాగిస్తాం..

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలం అజ్ఞాత జీవితం గడిపి పేదల కోసం అహర్నిశలు పరితపించిన విప్లవోద్యమ నాయకుడు లింగన్న అని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం లింగన్న 4వ వర్ధంతిని నిర్వహించారు. అమరుల స్మారక స్థూపాల వద్ద ఎర్రజెండా ఎగురవేసి లింగన్నకు జోహార్లు అర్పించారు. మధు మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలలో పేదల కోసం పోడు నరికి వేల ఎకరాలు పంచిపెట్టిన ఘనత లింగన్నదని గుర్తుచేశారు. లింగన్న పేదల పక్షాన ఉన్నందుకే పోలీసులు అర్ధరాత్రి పట్టుకొని కాల్చిచంపారని విమర్శించారు. లింగన్న స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ

టేకులపల్లి: బైక్‌ను ట్రాలీ ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రమణారెడ్డి తెలిపిన వివరాలు.. కొత్తతండా(పి) గ్రామానికి చెందిన అంగోతు రామ్‌కోటి, మధుచంద్ తండ్రీ కొడుకులు. ఆదివారం బైక్‌పై టేకులపల్లికి వెళ్తున్నారు. దుబ్బతండా వద్ద ఎదురుగా వస్తున్న ట్రాలీ ఢీకొట్టడంతో కింద పడిపోయారు. ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. మధుచంద్‌కు కాలు విరిగింది. స్థానికులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. దీప్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు


నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: మండలంలోని పలు తండాల్లోని గిరిజన యువతులు, మహిళలు తీజ్ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులుగా వెదురు బుట్టల్లోని గోధుమలు, వేరుశనగ గింజలు మొలకలు వచ్చిన బతుకమ్మలను పెళ్లికాని యువతులు, మహిళలు పూజించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ సమీపంలోని వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బానోత్ విజయబాయి పాపకొల్లు గ్రామ పంచాయతీ బీమ్లా తండా, ముత్యాలమ్మ కాలనీలలో జరిగిన తీజ్ ఉత్సవ వేడుకలకు హాజరయ్యారు. అదేవిధంగా సాయిరాంతండా, పాపకొల్లు గ్రామాల్లో తీజ్ వేడుకలకు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ హాజరయ్యారు. లావుడ్యా సోని, లకావత్ గిరిబాబు, పసుపులేటి మోహన్‌రావు, పొన్నెకంటి సతీష్ కుమార్, నున్నా రంగారావు, దుద్దుకూరి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం..


మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

చుంచుపల్లి: వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. ఆదివారం చుంచుపల్లి మండలం ధన్‌బాద్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు సునీల్ ఆధ్వర్యంలో 500 వందల కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ.. రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్ ఏరియాలకు చెందిన అనేక మంది కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని త్వరలో ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులకు మూడు ఎకరాల భూమి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించనున్నట్లు చెప్పారు. వచ్చే నాలుగు నెలలు కార్యకర్తలు శ్రమించి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఊకంటి గోపాల్‌రావు, రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరావు, పల్లపు వెంకటేశ్వర్లు, ఆళ్ల మురళీ, కల్లేపల్లి రాజు, సిరంగి శ్రీను, శనగ లక్ష్మణ్, నాగభూషణం, జెరీనా, సుబ్బారెడ్డి, కలిపాక సత్యనారాయణ, బొజ్జ వెంకటస్వామి, రమేష్, బద్ది కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం కమిటీ ఎన్నిక


సమావేశమైన భవన నిర్మాణ కార్మికులు

పాల్వంచ: పాల్వంచ పట్టణ, మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ధరావత్ గోపి నాయక్, ప్రధాన కార్యదర్శిగా కోరి కృష్ణ నియామకమయ్యారు. ఆదివారం స్థానిక కార్మిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పునుమూడి పున్నయ్య, కోశాధికారిగా గోవిందయ్య, ఉపాధ్యక్షుడిగా నల్లి సురేశ్, పగిళ్ల శ్రీను, భీమనబోయిన గురువయ్య, వాసమల్ల మోషే, లింగం లక్ష్మయ్య. సహాయ కార్యదర్శులుగా ఉప్పుతల వెంకటేశ్వరరావు, జక్కుల శాంత కుమార్, డి.రమేశ్, మహ్మద్ జావేద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లెల శ్రీను, మంగళగిరి రాంబాబు, పోనెం సుదీర్, గౌరవ సలహాదారులుగా ఆరెళ్ల ఈశ్వరయ్య, బండారి రమణయ్య, వేముల కొండయ్య, నంది కోటయ్య, మొరుగు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, వేణుగోపాల్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అన్నారపు వెంకటేశ్వరరావు, నరహరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): ప్రజారవాణా సంస్థగా పేరుగాంచిన ఆర్టీసీని పాలక ప్రభుత్వాలు, నిర్వీర్యం చేస్తున్నాయని, ఆర్టీసీ ఉద్యోగులకు సమ్మె సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశా రు. ఆదివారం సీపీఐ జిల్లా కేంద్రమైన శేషగిరిభవన్‌లో సేవ్ ఆర్టీసీ పేరుతో సీపీఐ, సీపీఎం వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. బస్సుల సంఖ్య కుదించి ప్రైవేట్ బస్సులతో కాలయాపన చేస్తున్నారన్నారు. ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కెచ్చెర్ల రంగయ్య, దమ్మాలపాటి శేషయ్య, లిక్కి బాలరాజు, సురేందర్, కందుల బాస్కర్, వై.శ్రీనివాస్‌రెడ్డి, జి.వీరస్వామి, కంచర్ల జమలయ్య, కే.నాగభూషణం, కే.రత్నకుమారి, గోనెల రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఆదేశాలు విరమించుకోవాలి


ప్రభుత్వ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వ విద్యా సంస్థలలోకి విద్యార్థి సంఘాలను, మీడియాను అనుమతించరాదంటూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన డీఈఓలకు ఆదేశాలు జారీ చేయటం అత్యంత హేయమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్ప రాజేష్, భూక్యా శ్యామ్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బాలలోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేకుంటే దోపిడీకి నిలయాలుగా మారతాయన్నారు. ప్రభుత్వం కనీస సదుపాయాలు కల్పించటంలో విఫలమైందన్నారు. అనేక హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు కూడా లేవన్నారు. వర్షాలకు తడుస్తూ భోజనం తింటున్నట్లు చెప్పారు. అధ్యాపకులు, టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయటం లేదన్నారు. విద్యా సంస్థలలో ఒకపక్క ఆత్మహత్యలు, ఈవిటీజింగ్, ర్యాగింగ్, వేధింపుల సంఘటనలు పెరిగిపోతున్నాయని తెలిపారు. నిధుల దుర్వినియోగం సాగుతోందని, ఇలాంటి తరుణంలో ఈ అకృత్యాలు వెలుగు చూడకుండా ఉండేందుకు అనుమతి నిరాకరణ చేస్తున్నారని ఆరోపించారు.

మణిపూర్ దుర్ఘటన మాయని మచ్చ

మణిపూర్ దుర్ఘటన దేశానికే మాయనిమచ్చ. ప్రజాస్వామ్యాన్ని మతఛాందసవాదులు ఖూనీ చేస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. పలు చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కొత్తగూడెం , ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్ సమాజం మీద మూకుమ్మడి దాడులు సాగుతున్నాయని, అక్కడి క్రిస్టియన్లకు రక్షణ కల్పించాలని కోరారు. ర్యాలీలో పాస్టర్లకు పలు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


సుజాతనగర్: మానవహారం చేపట్టిన క్రైస్తవులు


కొత్తగూడెం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ


ఇల్లెందు: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



కొత్తగూడెం పట్టణంలో..

నల్లబ్యాడ్జీలు ధరించి పారిశుద్ధ్య పనులు

ఇల్లెందు: పట్టణంలోని ఆయా వార్డులలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ పి.కుమారస్వామి ఆధ్వర్యంలో 21వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. 10 రోజులుగా భారీ వర్షాలు కురిసినందున భూమి పదునుగా ఉండి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అలాగే నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని పాత్రలు, నీటితొట్లు క్లీన్ అండ్ గ్రీన్ పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇక మీదట ప్రతీ ఆదివారం ఉదయం 10:10 గంటలకు డ్రైడే పాటించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత, జవాన్ ప్రకాష్, ఆర్పీ రాధిక, ఓటీ వార్డు కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ కొండపల్లి కోటేశ్వరరావు, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు వివిధ రూపాల్లో చేపట్టిన నిరవధిక సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోవడంతో కార్మికులు వినూత్న నిరసనకు దిగారు. పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వాన స్థితికి చేరుకోవడం, మరోవైపు భారీ వర్షాలతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో మానవతా దృక్పథంతో పంచాయతీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి ఒకపూట పారిశుద్ధ్య పనులు చేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో కార్మికులు చెత్తను తొలగించారు. వీధులలో బ్లీచింగ్ చల్లారు. గతంలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పనులు చేసిన కార్మికులు ప్రస్తుతం ఎవరి పర్యవేక్షణ లేకుండానే స్వచ్ఛందంగా పనులు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన చెత్త పేరుకుపోయింది. ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీ, ఏపీఓ శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో కార్యదర్శులు గ్రామాల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. చెత్తా చెదారం తొలగించారు. ప్రధాన రహదారి వెంబడి, గ్రామాల్లోని వీధుల్లో బ్లీచింగ్ చల్లారు.